క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



మొగుళ్లపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతుగల్లు వాడు నుంచి అనుమతి పత్రాలు లేకుండా ట్రాక్టర్ లో ఇసుక తరలిస్తున్నారు. ఈక్రమంలో పోలీసులను చూసిన ట్రాక్టర్ డ్రైవర్ పారిపోగా.. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

రేపు కమిటీ ఎన్నిక

చిట్యాల: అంబేడ్కర్ యువజన సంఘం మండల కమిటీని ఈ నెల 18న మండల కేంద్రంలో ఎన్నుకోనున్నట్లు ఏవైఏస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అంబేడ్కర్ వాదులు, మేధావులు, ఉద్యోగులు, కమిటీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

శ్రీరామ అక్షింతల శోభాయాత్ర



మొగుళ్లపల్లి: శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మంగళవారం పోతుగల్లులో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర మండల సంచాలన సమితి ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రామ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్: ఆదర్శ పద్మశాలి సహకార సంఘం నూతన సంవత్సర పద్మశాలి వంశవృక్షం క్యాలెండర్‌ను మంగళవారం సుభాష్ కాలనీలో ఆ సంఘం అధ్యక్షుడు కొండ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోసంఘం గౌరవ అధ్యక్షుడు గోరంటల విక్రమ్ సేన, ఉపాధ్యక్షుడు చీకటి తిరుపతి, కోశాధికారి కూచన కిషన్ ప్రసాద్, సహాయ కార్యదర్శులు అశోక్ కుమార్ , వావిలాల మహేందర్, కార్యవర్గ సభ్యులు భూర్ల రమేష్, మామిడాల లక్ష్మణ్, పాశికంటి శ్రీనివాస్, గౌరవసలహా దారుడు కుసుమ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కేటాయించాలని వినతి

కాటారం: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతిపత్రం సమర్పించినట్లు మండలంలోని జాదారావుపేటకు చెందిన బాడిశగండు అరుణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2007 నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర ఏర్పాటుకు తనవంతుగా పోరాడినట్లు అరుణ్ పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో నేతకాని సామాజిక వర్గం ఎక్కువగా ఉన్నందున అదే వర్గానికి చెందిన తనకు పార్టీ టికెట్ కేటాయించాలని మంత్రిని కోరినట్లు అరుణ్ తెలిపారు.

మాయావతి జన్మదిన వేడుకలు



కాటారం: బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి 68వ జన్మదిన వేడుకలను సోమవారం బీఎస్పీ నాయకులు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ అస్పత్రుల్లోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు రామిళ్ల రాకేశ్, మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌కు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా సేవలందించిన ఉక్కు మహిళ మాయావతి అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా పేదవారికి భూ పంపిణీ, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, ఉన్నత విద్య కోసం కృషి చేసిన ఘనత మాయావతికే దక్కిందని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించేలా అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపించారని తెలిపారు. మౌలానా, రమేశ్ పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ

వాజేడు: మండల పరిధిలోని బొల్లారం, ఆరుగుంట పల్లి మొదలైన గ్రామాల్లోని పేద విద్యార్థులకు మంగళవారం ఎంపీపీ శ్యామల శారద చేతుల మీదుగా రగ్గులు గిఫ్ట్ ప్యాకెట్స్, స్నాక్స్ పంపిణీ చేశారు. వీటిని గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం ద్వారా అందించారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, కంతి శ్యామ్ తదితరులు ఉన్నారు.

టేకుమట్ల: వెంకట్రావుపల్లిలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



మల్హర్: తాడిచర్లలో ఇంటి ఎదుట ముగ్గు వేస్తున్న యువతి



టేకుమట్ల: టేకుమట్లలో ముగ్గు వేస్తున్న చిన్నారులు



ఊరూరా సంక్రాంతి వేడుకలు

పల్లెల నిండా బంధువులే..
- భోగి మంటలు, గాలిపటాలతో ఆడిపాడిన చిన్నారులు
- కనుమతో ముగిసిన సంబురాలు



కాటారం: సంక్రాంతి వేడుకలో కాంగ్రెస్ నాయకులు

కాటారం: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ప్రజలు సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో మహిళలు సంప్రదాయ బద్దంగా నోములు నోచుకున్నారు. ఇంటింటా తిరిగి నోములు ఇచ్చిపుచ్చుకున్నారు. మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు జరిపారు. చిన్నారులతో కలిసి నాయకులు పతంగులు ఎగరవేసి స్వీట్లు పంపిణీ చేశారు. గ్రామాల్లో చిన్నారులు పతంగులు ఎగరవేసి ఆహ్లాదంగా గడిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం, శ్రీఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అయ్యప్ప ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాత్రి అయ్యప్ప మాలాధారణ భక్తులు మకర జ్యోతి కార్యక్రమం నిర్వహించారు. పదునెట్టాంబడి మెట్లపై దీపాలు వెలిగించి పడిపూజ చేశారు. అయ్యప్ప శరణుతో ఆలయ ఆవరణ మార్మోగింది. ఆలయ పురోహితులు గుండు భానుప్రసాద్‌శర్మ, ఆలయ వ్యవస్థాపకులు బచ్చు అశోక్‌గుప్త, అధ్యక్షుడు బచ్చు ప్రకాశ్, గురుస్వాములు పీచర రామకృష్ణరావు, జక్కు మొగిలి, చీమల రాజు, జక్కు రాకేశ్, మాలాధారణ స్వాములు, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, మంత్రి విజయ రాజు, మంత్రి నరేశ్ పాల్గొన్నారు.

మల్హర్: సంక్రాతి, కనుమ వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఆడపచులు ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేసి వాకిళ్లను అందంగా అలంకరించారు. గ్రామాల్లో మహిళలు సంప్రదాయ బద్దంగా నోములు నోచుకున్నారు. యువకులు, పిల్లలు ఆనందంగా పతంగులు ఎగరవేశారు. అలాగే భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొగుళ్లపల్లి: సంకాంత్రి సంబరాలు అంబరాన్నంటాయి. మండలంలోని ప్రజలు సంకాంత్రి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఇంటా ఆడపడుచులు వేసిన రంగవల్లులతో భూమి తల్లి పులకించి పోయింది. పండుగ సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బసవన్నల ఆటలతో గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. వివిధ సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా మహిళలు భారీగా పాల్గొని ఆకర్షనీయంగా ముగ్గులు వేశారు.

ముగ్గుల పోటీలు

రేగొండ: మండలంలోని మడ్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు మామిడాల కావ్య, నవ్య జూనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు మోటపోతుల రితిక, జంగిలి హక్షిత గెలుపొందారు. విజేతలకు నగదు, బహుమతులు ప్రదానం చేశారు. కందకట్ల శ్రీహరి, సూర రాఘవులు, చిటికనేని సుదర్శన్ దాతలుగా జంగిలి తిరుపతి, మేకమల్ల రంజిత్, చక్రం రాజు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కందకట్ల భిక్షపతి, కొయ్యడ భిక్షపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: ముగ్గు వేస్తున్న మహిళ

టేకుమట్ల: మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పర్వదినం సందర్భంగా సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటి ముంగిళ్లలో రంగవల్లులతో అలంకరించి గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. ప్రతీ ఇంట్లో పిండి వంటలు పిల్లా పాపలతో సరదాగా గడిపారు. మండలంలోని వెంకట్రావుపల్లిలో శ్రీసరస్వతీ విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి కనబర్చిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, చంద్రకళ, ఉప సర్పంచ్ మమత, శ్రీసరస్వతీ విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ ఓంనారాయణ పాల్గొన్నారు.



రేగొండ: ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



మహాముత్తారం: గొబ్బెమ్మలు పెడుతున్న చిన్నారి

మహాముత్తారం: మకర సంక్రాంతిని పురస్కరించుకొని మహిళలు రంగవల్లుతో ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. చిన్నారులకు బోగిపళ్లు పోశారు. మహిళలు నోములు నోచుకున్నారు.

కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, తదితరులు

ములుగు రూరల్: కల్లుగీత కార్మిక సంఘం నూతన క్యాలెండర్‌ను జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ మేరకు మంగళవారం క్యాలెండర్ ఆవిష్కరణ సంఘం జిల్లా అధ్యక్షుడు పలి నర్సయ్యగౌడ్ ఆధ్వర్యంలో చేపట్టగా ములుగు ఎక్సైజ్ సీఐ సుధీర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు. కార్మికులకు ఇబ్బందిగా ఉన్న మెడికల్ బోర్డు విధానాన్ని రద్దు చేసి కల్లు గీత సొసైటీలను పునరుద్ధరించాలని కోరారు. తాడి కార్పొరేషన్‌కు నిధులను పెంచాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండబోయిన రవిగౌడ్, కారుపోతుల యాదగిరి, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, మునిసపల్లి కుమార్‌గౌడ్, బుర్ర జనార్దన్, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

21న టీజేఎస్ రాష్ట్ర సదస్సు

నర్సంపేట : ఈనెల 21న హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ తెలిపారు. సదస్సు వాల్‌పోస్టర్లను పట్టణంలో మంగళవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది జనవరి 30న ఢిల్లీలో దీక్షలు చేపట్టినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో విభజన హామీల సాధన ఉద్యమం తీవ్రం చేయడానికి ఈనెల 21న సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుంటి రాంచందర్, బోనగాని రవీందర్, గుంటి సంజీవ, సాయికుమార్, సాంబరాతి మల్లేశం, మహ్మద్ సంధాని, యాకూబ్‌పాషా, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

వెంకటాపురం(కె): వెంకటాపురం(కె) తహసీల్దార్‌గా సర్వర్ పాషా మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సమ్మయ్య బదిలీపై కలెక్టరేట్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో సర్వర్ పాషా వచ్చారు.

హనుమాన్ ధ్వజారోహణ పూజ

చిట్యాల: మండల కేంద్రంలోని స్థానిక పీఏసీఎస్ అవరణంలో హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో హనుమాన్ ధ్వజారోహణ పూజ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్య రామాలయంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రంలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు. అలాగే ఈప్రాంతం మొత్తం భూమి పూజతో పాటు వేదమంత్రాలతో శుద్ధి కార్యక్రమం చేపడతామన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించి విజయవంతం చేయాలని కోరారు. హనుమాన్ భజన మండలి కమిటీ సభ్యులు నేపాలి వేణు సింగ్, చిలుముల శ్రీనివాస్, బుర్ర సదయ్య, గుమ్మడి సత్యం, కట్కూరి నరేందర్, బుర్ర సదయ్య, భైరం భద్రయ్య, క్యాతం మార్కండేయ, బుర్ర వెంకటేష్ గౌడ్, సాంబయ్య పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

అయ్యప్ప మాలధారుల ఇరుముడి

కాటారం: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం, మంగళవారం ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. 41 రోజుల పాటు కఠిన నియమాలతో మండల దీక్ష పూర్తి చేసుకున్న పలువురు అయ్యప్ప మాలధారణ స్వాములు ఇరుముడి కట్టుకున్నారు. అయ్యప్ప ఆలయ పురోహితులు గుండు భానుప్రసాద్‌తో పాటు పలువురు గురుస్వాములు కేరళ శాస్త్రీయ పద్ధతిలో మాలధారణ స్వాములకు ఇరుముడి ఎత్తారు. ఇరుముడులు ఎత్తుకొని స్వాములు ఆడిపాడారు. నృత్యాలు చేస్తూ పరవశించిపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు బచ్చు అశోక్‌గుప్త, గురుస్వాములు పీచర రామకృష్ణరావు, చీమల రాజు, రాంచంద్రం, జనగామ కార్తీక్‌రావు, బుర్ర వెంకటేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఇరుముడితో అయ్యప్ప భక్తులు

మొగుళ్లపల్లి భజన మండలికి ద్వితీయ స్థానం



బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

మొగుళ్లపల్లి: పరకాలలోని శ్రీ సద్గురు షిర్డీ సాయి బాబా మందిరంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం భజన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొగుళ్లపల్లి శ్రీశివరామ కృష్ణ భజన మండలి ద్వితీయ స్థానంలో నిలిచింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా రూ.10016, మెమెంటో అందజేశారు. మొగుళ్లపల్లి భజన మండలి సభ్యులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. భజన మండలి సభ్యులు గుర్రపు అన్నారెడ్డి, బండారి కుమార్ స్వామి, చింతకింది నగేష్, అరికంతపు అన్నారెడ్డి, మోటె శ్రీధర్, నాగలగాని శ్రీనివాస్, గుర్రపు మల్లేషం, క్యాతరాజు రాజయ్య, మోడె రాజుకుమార్, మోహన్‌రెడ్డి, ఓదేలు, ఆగయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏటూరునాగారం: ఏటూరునాగారం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ తీగల మెంటనెన్స్‌ను నేడు(బుధవారం) నిర్వహించనున్నట్లు ఏఈ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటూరునాగారం నుంచి తాడ్వాయి వరకు ప్రధాన ఫీడర్ మెంటనెన్స్ ఉంటుందని.. దీంతో ఆకులవారిఘణపురం, చిన్నబోయినపల్లి, షాపెల్లి, ఐటీడీఏ క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిలిచిపోతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ భవేష్‌మిశ్రా



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

టేకుమట్ల: మేడారం శ్రీసమ్మక్క- సారలమ్మ జాతర సమయానికి టేకుమట్ల- రాఘవరెడ్డిపేట చలివాగులో తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణానికి ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. రాఘవరెడ్డిపేట- టేకుమట్ల చలివాగుపై నిర్మించిన వంతెన వర్షాకాలంలో భారీ వరదలకు కూలిపోగా తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణం కోసం మంగళవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వంతెన పునఃనిర్మాణానికి నిధులు మంజూరైనా, పూర్తి స్థాయిలో నిర్మాణానికి సుమారు 3–5నెలల సమయం పడుతుందన్నారు. కావున అంకుషాపూర్ –రాఘవరెడ్డిపేట నుంచి రోడ్డు, టేకుమట్ల–రాఘవరెడ్డిపేట నుంచి మరో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు కోరుతున్నట్లు తెలిపారు.

మేడారం భక్తులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తాం

కూలిన వంతెన మీదుగా రాఘవరెడ్డిపేట నుంచి టేకుమట్ల వరకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనాలు, పాదచారుల కోసం తాత్కాలిక వంతెన నిర్మించారు. కానీ పెద్ద వాహనాలు వెళ్లే వీలు లేకుండాపోవడంతో మేడారం జాతరకు వెళ్లే భక్తులకు తాత్కాలిక మట్టి రోడ్డును నిర్మించి రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించి, ఫిబ్రవరి మొదటి వారంలో పెద్ద వాహనాలు సైతం చలివాగు దాటేందుకు చర్యలు చేపడతామన్నారు. వారి వెంట ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ అనిత, సర్పంచ్ పొలాల సరోత్తంరెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఈఈ రాజ్‌దిలీప్‌కుమార్, ఎస్సారెస్పీ మాజీ చైర్మన్ ఆకుల రవీందర్, జీ.అశోక్, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, నాంపెల్లి వీరేశం, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

వాలీబాల్ కిట్ల అందజేత



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల, కుంట్లం గ్రామాల్లోని యువతకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబుల ఆదేశాల మేరకు సంక్రాంతి పండగ సందర్భంగా పలుగుల మాజీ సర్పంచ్ ఒడ్డి చంద్రయ్య వాలీబాల్ కిట్లను అందజేశారు. సోమవారం ఆయా గ్రామాల్లోని యువతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మచ్చ రాజయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు మానెం మహేష్, గారె శంకర్, వడ్లకొండ సమ్మయ్య, శేఖర్, సంతోష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: అనాథ కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు మంగళవారం మండల కేంద్రంలో తన నివాసం వద్ద ఆర్థిక సాయం అందించారు. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన గంధర్ల రమేష్ తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా జీవిస్తుండడంతో ఆ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు విషయాన్ని జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన లక్ష్మీనర్సింహారావు తన నివాసంలో యువకుడికి రూ.40వేలు అందించారు. కార్యక్రమంలో తాడ్వాయి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లయ్య, ఉపసర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, పులుసు పురుషోత్తం, ఏటూరునాగారం పీఏసీఎస్ చైర్మన్ కోనూరు అశోక్, రఘు, ఎజాజ్, రమేష్, యాదగిరి, ఖలీల్, ముత్తేష్, నర్సయ్య పాల్గొన్నారు.

గరీబ్ నవాజ్ గ్యార్మీ షరీఫ్

నర్సంపేట : పట్టణంలోని మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మసూద్ బేగ్ నివాసంలో సోమవారం హజ్రత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తి రహ్మతుల్లా అలైహ్ (గరీబ్ నవాజ్) గ్యార్మీ షరీఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ హాజరై అల్లాకు పుష్పాలు సమర్పించి ప్రార్థన చేశారు. అనంతరం మసూద్‌బేగ్ ఏర్పాటు చేసిన అతిథ్యాన్ని స్వీకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నాయకులు మెరుగు సాంబయ్య, అయూబ్, డిష్ బాబా పాల్గొన్నారు.

పండుగలు గొప్పగా జరుపుకోవాలి



విజేతలకు స్కూటీని అందజేస్తున్న ఎస్సై

ఏటూరునాగారం: ప్రజలు పండుగలను గొప్పగా జరుపుకోవాలని ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని కె. మార్ట్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా సరుకులు కొనుగోలు చేసిన వారికి షాపు యజమాన్యం కూపన్స్ అందజేసింది. కూపన్స్ డ్రాను మంగళవారం మండల కేంద్రంలోని మార్ట్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్సై కృష్ణప్రసాద్ హాజరై డ్రా తీయగా మండల కేంద్రానికి చెందిన కందగట్ల భాస్కర్ వర్షిణి దంపతులకు మొదటి బహుమతిగా స్కూటిని గెలుచుకున్నారు. కె.మార్ట్ యజమానులు పెద్ద బోయిన నర్సింగరావు, సర్కార్, గ్రామస్తులు పాల్గొన్నారు.